క్లుప్తంగా

మేజర్ పంచాయతీ అభివద్ధికి కృషి


పంచాయతీ కార్యదర్శి నరేంద్ర

వెలుగోడు: స్థానిక మేజర్ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని కొత్తగా విధుల్లో చేరిన పంచాయతీ కార్యదర్శి నరేంద్ర తెలిపారు. నంద్యాల మండలం పోలూరు పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న ఆయన పదోన్నతిపై వెలుగోడుకు వచ్చారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల సహకారంతో పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు

కుమారస్వామికి విశేషపూజలు


ప్రత్యేక పూజల అనంతరం కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

మల్లన్న సన్నిధిలో సినీ గేయ రచయిత


శ్రీశైలంలో సినీ గేయ రచయిత భాస్కరభట్ల

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ప్రముఖ సినీ గేయ రచయిత భాస్కరభట్ల రవికుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మంగళవారం శ్రీశైలం చేరుకుని వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో మల్లికార్జున స్వామిని దర్శించుకుని అభిషేకం నిర్వహించుకున్నారు. అలాగే భ్రమరాంబాదేవిని దర్శించుకున్నారు. అనంతరం పలువురు అభిమానులు ఆయనతో ఫొటోలు దిగారు.

నిబంధనలను పాటించాలి


మాట్లాడుతున్న ఆర్డీఓ నాగజ్యోతి

పగిడ్యాల: నిబంధనలను పాటించాలని ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి రెవెన్యూ సిబ్బందికి సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తూర్పు ప్రాతకోట గ్రామస్తులు నిర్మించుకున్న ఇళ్ల విషయమై అధికారులను ఆరా తీసి, పలు సూచనలు చేశారు. సమావేశంలో తహసీల్దార్ శివరాముడు, ఆర్ఐ శ్రీరంగారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మురళీ(సర్వే), మండల సర్వేయర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి


మహమ్మద్ ఇలియాస్(ఫైల్)

ఆత్మకూరు: పట్టణంలోని రఘునాథ్ థియేటర్ సమీపంలో నివాసముంటున్న మహమ్మద్ ఇలియాస్(35) సోమవారం చెట్టుపై నుంచి కింద పడి మృతిచెందాడు. మహమ్మద్ ఇలియాస్ తన ఇంటి ప్రాంగణంలోని నేరేడు చెట్టుపై పండ్లను తెంచుతుండగా కొమ్మ విరిగడంతో కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆత్మకూరులోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేకోక మృతిచెందాడు.

చుక్కల దుప్పి మృతి


వృద్ధాప్యంతో మృతి చెందిన దుప్పి

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలోని ఎనిమల్ పార్క్‌లో మంగళవారం చుక్కల దుప్పి మృతి చెందింది. సుమారు ఎనిమిదేళ్ల వయస్సున్న చుక్కల దుప్పి వృద్ధాప్యంతో మృతి చెందింది. మృతదేహాన్ని అధికారులు పంచనామా నిర్వహించి దహనం చేశారు.

నేడు ఎల్ఐసీ ఏజెంట్ల సమావేశం

వెలుగోడు: జీవిత బీమా సంస్థ ఏజెంట్ల సమావేశం బుధవారం ఆత్మకూరులో ఉంటుందని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ప్రెసిడెంట్ స్వామిదాస్, సెక్రటరీ సాయిబాబా, ట్రెజరర్ రాంబాబు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ సమావేశంలో ఏజెంట్ల సమస్యలు, ఇతర అంశాలపై చర్చించనున్నామన్నారు. సీనియర్ ఏజెంట్లు, క్లియా మిత్రులు, బీమా సఖి ఏజెంట్లు, ఈసీ మెంబర్లు పాల్గొంటారన్నారు.

నేడు వెన్నుపోటు దినం

● పెద్ద ఎత్తున పాల్గొననున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు


వెన్నుపోటు దినం వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న డాక్టర్ సుధీర్, నాయకులు, కార్యకర్తలు

సూపర్ సిక్స్ హామీలిచ్చి అధికారం చేపట్టి యేదాది పూర్తయినా నెరవేర్చకపోవడంతో బుధవారం వెన్నుపోటు దినం నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధమయ్యాయి. ఎన్నికల సమయంలో గొప్పలు చెప్పిన కూటమి ప్రభుత్వం ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేదు. దీంతో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నియోజకవర్గా కేంద్రాల్లో వెన్నుపోటు దినం పేరుతో నిరసన, ర్యాలీ తదితర కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఆత్మకూరులో బండిఆత్మకూరు, వెలుగోడు, మహానంది, శ్రీశైలం మండలాల నుంచి పార్టీ మండల అధ్యక్షులు, కన్వీనర్లు, ఉపాధ్యక్షులు, జిల్లా, మండలాల, రాష్ట్ర కమిటీ సభ్యులతోపాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొననున్నారు. ఇప్పటికే శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి నాయకులను, కార్యకర్తలను కలిసి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. – ఆత్మకూరు

హామీల అమలులో చంద్రబాబు విఫలం

నందికొట్కూరు: ఎన్నికల హామీల అమలులో చంద్రబాబు నాయుడు విఫలమయ్యారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్ విమర్శించారు. మంగళవారం పార్టీ జిల్లా నాయకులు కోకిల రమణారెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం చేపట్టి ఏడాది అయినా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. అలాగే మిడుతూరు మండల కేంద్రంలో శివరామకృష్ణారెడ్డి స్వగృహంలో వెన్నుపోటు దినం వాల్ పోస్టర్లను డాక్టర్ దార సుధీర్ ఆవిష్కరించారు. నిరసన కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఆయా సమావేశాల్లో నందికొట్కూరు పట్టణ అధ్యక్షులు మన్సూర్, జెడ్పీటీసీ జగదీశ్వరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్తర్‌బాషా, అబుబక్కర్, జనార్దన్‌గౌడు, నాయబ్, రాజు, అశోక్‌రెడ్డి, నాగశేనారెడ్డి, మాధురి, సులోచనమ్మ, రవి, వైఎస్సార్‌సీపీ మిడుతూరు మండల నాయకులు శంకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, పెద్ద పుల్లారెడ్డి, రాముడు, రవికుమార్, సర్పంచులు వెంకటేశ్వర్లు, సాంబశివుడు, స్వామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

➤ కొత్తపల్లి: నందికొట్కూరులో బుధవారం నిర్వహించే వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి తరలిరావాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి, నాగంపల్లి సొసైటీ మాజీ చైర్మన్ గౌరు జనార్దన్ రెడ్డి నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. మంగళవారం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిందన్నారు.

➤ పాములపాడు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు తీరుపై బుధవారం నందికొట్కూరులో చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగరాజు పార్టీ శ్రేణులను కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి భారీగానాయకులు, కార్యకర్తలుతరలిరావాలన్నారు.

➤ వెలుగోడు: ఆత్మకూరులో శిల్పా చక్రపాణి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి తరలిరావాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్ కోరారు.

వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు


పగిడ్యాలలో కరపత్రాలు విడుదల చేస్తున్న దారా సుధీర్

పగిడ్యాల: వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించుకున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దారా సుధీర్ అన్నారు. బుధవారం నిర్వహించే వెన్నుపోటు దినాన్ని పురస్కరించుకుని మంగళవారం జెడ్పీటీసీ పుల్యాల దివ్య, పార్టీ మండల అధ్యక్షులు పుల్యాల నాగిరెడ్డి ఇంటిలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో వెన్నుపోటు దినం కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలు ఇస్తానని మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఏడాది అవుతున్నా ఒక్క పథకం కూడా అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచారన్నారు. వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి కార్యకర్తలు, అభిమానులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్‌నాయుడు, జిల్లా కార్యదర్శి కాటం వెంకటరమణ, మండల ప్రధాన కార్యదర్శులు పాలూరు వెంకటేశ్వర్లు, రమణప్రసాద్, సర్పంచ్‌లు పెరుమాళ్ల శేషన్న, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు నాగశేనారెడ్డి, శశిగౌడ్, దేవేంద్ర, ఎంసీ బాషా, రసూల్, మహేష్‌నాయుడు, వర్కర్ ముత్తు పాల్గొన్నారు.

సున్నిపెంటలో కార్డెన్ సెర్చ్


కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

శ్రీశైలంప్రాజెక్ట్: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం సున్నిపెంటలోని రాజీవ్‌గాంధీ కాలనీలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. టూటౌన్ సీఐ చంద్రబాబు, ఎస్ఐ సుబ్బారెడ్డి, వన్‌టౌన్ పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు సోదాలు నిర్వహించారు. కాలనీలో 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ లేని రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చంద్రబాబు తెలిపారు.

పాదరక్షల కౌంటర్ వద్ద గొడవ

మహానంది: మహానంది దేవస్థానం ప్రాంగణంలోని పాదరక్షలు భద్రపరుచుకునే కౌంటర్ వద్ద నిర్వాహకులకు, భక్తుల మధ్య మంగళవారం జరిగిన గొడవ పోలీస్‌స్టేషన్ చేరింది. అలంపూర్ జిల్లాకు చెందిన మధురవాణి, తన కుటుంబ సభ్యులతో మహానందికి వచ్చారు. పాదరక్షలను కౌంటర్‌లో కాకుండా బయట విడిచి దర్శనానికి వెళ్లొచ్చేలాగా కౌంటర్ నిర్వాహకులు వారి పాదరక్షలను తెచ్చి కౌంటర్‌లో పెట్టారు. వెతికిన ఆమె కౌంటర్ వద్దకు చేరుకుని తమ చెప్పులు ఎక్కడ అని ప్రశ్నించడం, డబ్బు ఇచ్చి తీసుకోండంటూ వారు చెప్పడంతో ఇరువురి మధ్య వాగ్వాదం తీవ్రస్థాయికి చేరింది. స్థానికుల సమాచారంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి స్టేషన్‌కు పిలిపించి వివరాలు సేకరించారు.

వసతి గృహాలను శుభ్రంగా ఉంచండి


హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: త్వరలో విద్యాసంవత్సరం పునప్రారంభం కానుండటంతో వసతి గృహాలను శుభ్రం చేసి సిద్ధంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్, కాలేజీ హాస్టల్‌ను పరిశీలించారు. ఇడ్లీ పాత్ర, 3 గ్యాస్ స్టవ్‌లు, గ్రైండర్, ఫ్రిజ్ మంజూరు కావడంతో వాటిని సక్రమంగా వినియోగించాలని, విద్యార్థినులకు మెనూలో పొరపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రస్తుతం ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలు ప్రారంభమయ్యాయని, కళాశాల పునప్రారంభమయ్యేలోగా శుభ్రం చేసి సిద్ధంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ నాగరవీంద్ర ఉన్నారు.

చిరుధాన్యాల సాగుతో లాభాలు


వేంపెంటలో జీవామృతం తయారీ విధానాన్ని రైతులకు చూపుతున్న శాస్త్రవేత్తలు

పాములపాడు: చిరుధాన్యాల సాగు, ప్రాసెసింగ్ ద్వారా రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చని భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర్లు, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ క్రిష్ణమూర్తి, డాక్టర్ ఆదినారాయణ సూచించారు. మంగళవారం వేంపెంట, బానకచెర్ల, పాములపాడు గ్రామాల్లో కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ, భారత వ్యవసాయ పరిశోధనా మండలి ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం వారి ద్వారా వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ భూసార పరీక్షలను అనుసరించి ఎరువులు వాడాలని సూచించారు. పశువుల ఎరువు, పచ్చి రొట్ట ఎరువులతో భూసారాన్ని పెంచుకోవచ్చన్నారు. వరి, మొక్కజొన్న, పసుపు, మిరప పంటలలో వచ్చే పురుగులు, తెగుళ్లు యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. జీవామృతం తయారీ విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమాల్లో ఏడీఏ ఆంజనేయ, ఏఓ ఫణీశ్వరరెడ్డి, జిల్లా వనరుల కేంద్రం ఏఓ హేమలత పాల్గొన్నారు.

నందీశ్వరునికి ప్రత్యేక పూజలు


శనగల బసవన్నకు పూజలు నిర్వహిస్తున్నఅర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైల క్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలువీరభద్ర స్వామికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వ హించారు. ఇందులో భాగంగా ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడైన వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఆరంభ పూజలలో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. తరువాత నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

15 మందిపై బైండోవర్

మహానంది: మండల పరిధిలోని గాజులపల్లె, గోపవరం, అబ్బీపురం, తదితర గ్రామాలకు చెందిన 15 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గతంలో పలు నేరాలకు పాల్పడిన వారితో పాటు చెడు ప్రవర్తన కలిగినవారిపై కేసులు నమోదు చేశామన్నారు.


ద్విచక్రవాహన దారులు హెల్మెట్ ధరించాలి

జూపాడుబంగ్లా: ద్విచక్రవాహనం దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి బైక్‌ను నడపాలని లేకపోతే జరిమానాలు తప్పవని ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన స్థానిక పోలీసుస్టేషన్ ఎదుట కేజీరోడ్డుపై వెళ్లే వాహనాలను తనిఖీచేసి జరిమానాలు విధించారు.

భూములను పేదలకు పంచాలి

మహానంది: మహానంది మండలంలోని ప్రభుత్వ భూములను పెద్దలు ఆక్రమించుకుని అనుభవిస్తున్నారని, వాటిని స్వాధీనం చేసుకుని పేదలకు పంచమని ఎన్నిసార్లు చెప్పినా అధికారులు స్పందించకపోవడంపై సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు మండల కార్యదర్శి సామేలు ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం డీటీ కామేశ్వరరెడ్డికి వినతిపత్రం అందించారు. జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ బుక్కాపురం వద్ద రస్తా పొరంబోకు భూములలో గత టీడీపీ ప్రభుత్వంలో స్థలాలు ఇచ్చారని, ఇళ్లు నిర్మించుకోకపోవడంతో అక్రమార్కులు ఆక్రమించారని మండిపడ్డారు. అధికారుల దృష్టికి తీసుకెళ్తే చీకటి ఒప్పందాలు చేసుకుని వత్తాసు పలికారన్నారు. ఇప్పటికైనా స్పందించి స్వాధీనం చేసుకోకపోతే భూపోరాటాల్లో భాగంగా ఎర్రజెండాలు పాతి పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు బాషా, దస్తగిరి, నాగరాజు, పార్వతమ్మ, హుసేన్‌బీ, హసీనా పాల్గొన్నారు.

పరామర్శ


డాక్టర్ వెంకటేశ్వర్లను పరామర్శిస్తున్న బీసీ సంఘం నాయకులు

ఆత్మకూరు: మండలంలోని కురుకుంద గ్రామ నివాసి, మాజీ ఎంపీటీసీ, బీసీ నాయకుడు డాక్టర్ వెంకటేశ్వర్లు అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం కర్నూలులోని ప్రయివేట్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకున్నారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకోవడంతో విషయం తెలుసుకున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు, ప్రధాన కార్యదర్శి డబ్బి వెంకటస్వామిగౌడ్, యం.వీరన్న, రామకృష్ణ, మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నెం బాలస్వామియాదవ్, డీలర్ రమణ, పెదన్న తదితరులు ఆయనను పరామర్శించారు. ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

సర్వేలను పూర్తి చేయండి

కొత్తపల్లి: గ్రామాల్లో నిర్వహిస్తున్న వివిధ సర్వేలను పూర్తి చేయాలని ఆత్మకూరు డీఎల్‌డీఓ సూర్యనారాయణ సచివాలయ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండలంలోని దుద్యాల, ఎదురుపాడు గ్రామాల సచివాలయాలను ఎంపీడీఓ మేరితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమం కోసం రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయాలన్నారు. సిబ్బంది విధులకు సరైన సమయంలో హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

‘సర్పంచును పిలవకపోవడం పొరపాటే’

పాములపాడు: మండల కేంద్రంలో రేషన్‌పంపిణీ ప్రారంభోత్సవానికి సర్పంచు మేకల భాగ్యమ్మను పిలవకపోవడం తమ పొరపాటేనని రేషన్ డీలర్లు మంగళవారం తహసీల్దార్ సుభద్రమ్మకు లిఖిత పూర్వకంగా సంజాయిషీ ఇచ్చుకున్నారు. ఈనెల 1న రేషన్ పంపిణీ ప్రారంభించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడం, ఆదివారం సెలవు దినం కావడంతో పాత పద్ధతిలోనే సరుకుల పంపిణీ చేపట్టామన్నారు. సర్పంచును పిలవకపోవడం అనేది తమ అభిమతం కాదన్నారు. ఇలాంటి పొరపాటు పునరావృతం కాబోదని డీలర్లు సంజాయిషీ ఇచ్చుకున్నారు.

ఘనంగా సుంకులమ్మ వార్షికోత్సవం

పాములపాడు: మండలంలోని మద్దూరు గ్రామంలో మంగళవారం సుంకులమ్మ దేవతా వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయం, నూతన విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించి సంవత్సరం అయినందున ఈ వేడుకలు నిర్వహించారు. ఆలయం వద్ద బలిదానం కార్యక్రమం చేశారు. గ్రామంలో ప్రతి ఇంట్లో బంధువులు, మిత్రులతో సందడి వాతావరణం నెలకొంది.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

వెలుగోడు: నియోజకవర్గానికి చెందిన 24 మంది వివిధ అనారోగ్య కారణాలతో చికిత్స పొంది ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.16,45,960 విలువైన చెక్కులను మంగళవారం వేల్పనూరు గ్రామంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు బాసటగా నిలుస్తుందన్నారు.

వేతనాలు మంజూరు

మహానంది: మహానందీశ్వరస్వామి దేవస్థానంలో పనిచేస్తున్న ఏజెన్సీ ఉద్యోగులకు రెండు నెలల వేతనాలు మంజూరు చేసినట్లు ఈఓ నల్ల కాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దేవస్థానంలో పనిచేస్తున్న సుమారు 85 మందికి రెండు నెలల వేతనాలకు సంబంధించి దేవస్థానం నిధుల నుంచి రూ. 30లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. మూడు నెలలుగా ఏజెన్సీ ఉద్యోగులకు వేతనాలు లేక అవస్థలు పడుతున్న వైనంపై గత నెల 14న ×పనిచేసినా పస్తులే!₹ శీర్షికన కథనం ప్రచురించడంతో స్పందించిన దేవదాయశాఖ అధికారులు కమిషనర్ ఆదేశాల మేరకు రెండు నెలల వేతనాలు చెల్లించేందుకు ముందుకు వచ్చారు. మరో నెల వేతనాలు త్వరలోనే చెల్లిస్తామని అధికారులు చెప్పారు.

నేడు విద్యార్థులకు పరీక్షలు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థులకు బుధవారం నైతికత మానవీయ విలువలు, 6న పర్యావరణ విద్యపై పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మంగళవారం తెలిపారు. ఫస్టియర్‌లో గైర్హాజరై ప్రస్తుతం సెకండియర్ చదువుతున్న విద్యార్థులు తప్పనిసరిగా పరీక్షకు హాజరు కావాలన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. అలాగే 2025–26 విద్యా సంవత్సరానికి అన్ని గ్రూపుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు.

మహానందిలో భక్తుల రద్దీ


కోనేరులో భక్తుల కోలాహలం

మహానంది: వేసవి సెలవులు ముగుస్తుండటంతో మహానంది క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వేలాది మంది భక్తులు మంగళవారం ఆలయానికి చేరుకుని రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.00 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు మహానందీశ్వరస్వామి దర్శనం కొనసాగింది.

అభ్యంతరాలు ఉంటే తెలపండి

బండిఆత్మకూరు: మండల పరిధిలోని విష్ణునందీశ్వర స్వామి ఆలయానికి వంశ పారపర ధర్మకర్తగా చిట్టిబొట్ల భరద్వాజ శర్మను నియమించేందుకు అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఆలయ ఈఓ వేణు నాథరెడ్డి తెలిపారు.

రెండు రోజుల్లో పెళ్లి.. యువతి అదృశ్యం

కోవెలకుంట్ల: మండలంలోని సొదరదిన్నెకు చెందిన ఓ యువతి మంగళవారం అదృశ్యమైనట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన యువతి తెల్లవారుజాము నుంచి కనిపించకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ తెలియలేదు. యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కాగా బుధ, గురువారాల్లో ఈ యువతి వివాహం జరగాల్సి ఉంది.

నేత్ర దానం


నేత్రాలను అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని బొంతల వీధికి చెందిన మారెం శ్రీదేవి(45) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈమె కోరిక మేరకు కుటుంబసభ్యులు నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఫ్రెండ్స్ సేవా సమితి అధ్యక్షుడు ఫణీంద్ర, చైర్మన్ విష్ణుగాయత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి ఐబ్యాంక్‌కు సమాచారం ఇవ్వడంతో వారు నేత్రాలను సేకరించి ఎల్‌వీ ప్రసాద్ ఐబ్యాంక్‌కు పంపించారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ కో ఆర్డినేటర్ కిశోర్, భ్రమరాంబా, రమేష్ బాబు, అనిల్, సుధాకర్, సులోచన పాల్గొన్నారు.

ఆలయాల కమిటీల నియామకం జరిగేనా...?


తూడిచెర్ల శంకరమల్లయ్యస్వామి, తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామి ఆలయం

జూపాడుబంగ్లా: జిల్లాలోని 43 దేవాలయాలకు ఆలయకమిటీల నియామకం కోసం దేవదాయశాఖ గత నెల ఆరో తేదీన నోటిఫికేషన్ జారీచేసింది. నోటిఫికేషన్ జారీ అయిన 20రోజుల్లోగా నిబంధనల ప్రకారంగా ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జిల్లాలోని ఆళ్లగడ్డ, దొర్నిపాడు, రుద్రవరం, సంజామల, శిరివెళ్ల, అవుకు, బేతంచర్ల, డోన్, గడివేముల, పాణ్యం, జూపాడుబంగ్లా, మిడ్తూరు, నందికొట్కూరు, పాములపాడు, నంద్యాల, బండిఆత్మకూరు మండలాల్లోని 43దేవాలయాలకు కమిటీ సభ్యుల నియామకం కోసం నోటిఫికేషన్ జారీచేశారు. 20రోజుల్లోగా గ్రామాల్లో స్థానికులై ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అయితే ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యే సిఫారసు లేఖలు ఇవ్వకపోవటంతో జిల్లా వ్యాప్తంగా కేవలం 26 దేవాలయాలకు మాత్రమే దరఖాస్తులు చేసుకొన్నట్లు సమాచారం. నందికొట్కూరు నియోజవర్గంలోని జూపాడుబంగ్లా మండలంలోని తూడిచెర్ల, తర్తూరు ఆలయాల కమిటీ సభ్యుల నియామకం కోసం ఉత్తర్వులు జారీచేశారు. నందికొట్కూరు మండలంలోని వీరభద్ర, చెన్నకేశవ, సుంకులమ్మ, ఆంజనేయస్వామి ఆలయాలకు, పాములపాడు మండలంలో వానాల, వేంపెంట, మద్దూరు గ్రామాల్లోని ఆలయాలకు, మిడుతూరు మండలంలో తలముడిపి గ్రామంలోని ఆలయానికి కమిటీ సభ్యుల నియామకం కోసం నోటిఫికేషన్ జారీచేశారు. అయితే నియోజకవర్గంలోని ఒక్కదేవాలయానికి కూడా ఆసక్తి ఉన్నవారెవ్వరూ దరఖాస్తు చేసుకోకపోవటం గమనార్హం. ఎమ్మెల్యే రెకమెండేషన్ లెటర్‌లేకుండా దరఖాస్తు చేసుకొన్నా ప్రయోజనం ఉండదనే కారణంతో దరఖాస్తు చేసుకోలేదని కొంత మంది భక్తులు పేర్కొంటున్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో పేరొందిన తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామి ఆలయానికి జాతర సందర్భంగా తాత్కాలిక కమిటీని నియమించి జాతరను మమ అనిపించారు. ఈనేపథ్యంలో నోటిఫికేషన్ వెలువడినందున శాశ్వత కమిటీని నియమించి ఆలయ అభివృద్ధికి దోహదపడాలని భక్తులు కోరుతున్నారు.

వైన్‌షాపులో చోరీ దొంగ అరెస్ట్


నిందితుడు ఆలమూర్ హసన్‌తో సీఐ, పోలీసులు

బేతంచెర్ల: వైన్ షాపులో చోరీ చేసిన దొంగను అరెస్టు చేసినట్లు సీఐ వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. గత నెల 25వ తేదీ స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని రమ్య వైన్స్ షాపు వెనుక భాగంలో రేకు కత్తిరించి లోనికి వెళ్లిన నిందితుడి రూ.3.99 లక్షలు అపహరించాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. సిమెంట్ నగర్ గ్రామంలోని కమ్యూనిటీ హాలు సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న చాగలమర్రికి చెందిన ఆలమూర్ హసన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. అతని వద్ద నుంచి రూ.3,71,570 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసు ఛేదించడంలో కృషి చేసిన పోలీస్ సిబ్బంది సుబ్బరాయుడు, గురుబాబు, రాజు నాయక్‌లను సీఐ అభినందించారు.